# వెయ్యి కోట్లతో అశోక్ మిండా విస్తరణ

- రెండేళ్లలో పబ్లిక్ ఇష్యూ
- విదేశీ విలీనాలపై కన్ను

న్యూఢిల్లీ: ఆటో విడిభాగాల దిగ్గజం అశోక్ మిండా గ్రూప్ భారీ విస్తరణ ప్రణాళికలు ప్రకటించింది. ఇందుకోసం వెయ్యి కోట్ల రూపాయలు ఇన్వెస్ట్ చేస్తామని, రెండేళ్లలో పబ్లిక్ ఇష్యూకు వస్తామని కంపెనీ అంటోంది. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ టర్నోవర్ 2,500 కోట్లు. 2013-14 నాటికి ఆరు వేల కోట్ల రూపాయల టర్నోవర్ మార్కును అధిగమించడమే తమ లక్ష్యమని, ఇందుకోసం వెయ్యి కోట్లతో ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా విస్తరిస్తున్నట్లు గ్రూప్ చైర్మన్ అశోక్ మిండా పేర్కొన్నారు. ప్రస్తుతం కంపెనీకి ఇండియాతో పాటు జర్మనీ, పోలాంట్, చెక్ రిపబ్లిక్, ఇండోనేషియా, వియెత్నాం, ఉజ్బెకిస్తాన్‌లలో 25 మాన్యుఫాక్చరింగ్ ప్లాంట్లు ఉన్నాయి. ఈ ప్లాంట్లలో ద్విచక్ర వాహనాలతో పాటు కార్లకు సేఫ్టీ సిస్టమ్స్, డ్రైవర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, టెలీమాటిక్స్‌లను ఉత్పత్తి చేస్తున్నారు. ఇటీవలే జర్మనీ ఆటో విడి భాగాల కంపెనీ ఆక్సిస్‌ను అశోక్ మిండా గ్రూప్ చేజిక్కించుకుంది. మరిన్ని కంపెనీల విలీనానికి పావులు కదుపుతున్నామని, 18 నెలల నుంచి 24 నెలల్లో గ్రూప్‌ను స్టాక్‌మార్కెట్‌లో లిస్ట్ చేస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా మిండా చెప్పారు.

ప్రస్తుతం కంపెనీ డైమ్లర్ క్రిస్లర్, వోక్స్‌వ్యాగన్ గ్రూప్, రేనాల్ట్, జనరల్ మోటార్స్‌కు విడిభాగాలను సరఫరా చేస్తోంది. యూరప్‌లో ఆరో కంపెనీని విలీనం చేసుకున్న తర్వాత మార్కెట్ పరిధి భారీగా విస్తరించిందని ఆయన తెలిపారు. అయితే.. ఆక్సిస్ డీల్ సైజ్‌ను వెల్లడించడానికి అశోక్ మిండా నిరాకరించారు.